క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుభాష్‌నగర్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని గాజులరామారం సబ్‌స్టేషన్ ఏఈ సత్యనారాయణ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11కేవీ కైలాస్‌హిల్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కైలాస్‌హిల్స్, బాలయ్యనగర్, ప్రాగా టూల్స్, ఐశ్వర్య ఎస్టేట్స్, మహదేవపురం, శ్రీరామచంద్రనగర్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

బాచుపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో...

నిజాంపేట్: విదుత్ ఫీడర్ల నిర్వహణ, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో మంగళవారం బాచుపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ఏఈ శాంతకుమార్ ఓ ప్రకటనలో తెలియజేశారు. మల్లంపేట్ ఫీడర్ పరిధిలోని కేఆర్‌సీఆర్ కాలనీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు... అదే విధంగా రెయిన్‌బో కాలనీ, బ్లాక్‌డైమండ్ కాలనీ, ఇందిరనగర్, ఐడీపీఎల్ కాలనీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ప్రగతినగర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

డాక్టర్స్‌కాలనీ ఫీడర్ పరిధిలోని శిల్ప లేఅవుట్, రిలయెన్స్ స్మార్ట్ పాయింట్, డాలర్ హోమ్స్, ఐసీఐసీఐ బ్యాంక్, కెనరా బ్యాంక్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సమ్మయ్య తెలిపారు.

నిజాంపేట్ సబ్‌స్టేషన్ పరిధిలో..

రాజధాని ఫీడర్ పరిధిలోని నిజాంపేట్ పాత గ్రామ పంచాయతీ కార్యాలయం రోడ్డు, రెడ్డి ఎవెన్యూ, అదిత్య లాగూన్ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు... అదే విధంగా బండారి లేఅవుట్ ఫీడర్ పరిధిలోని బండారి లేఅవుట్ రోడ్డు నం.1 నుంచి 4 వరకు, 5ఏ, 6ఏ, 7ఏ, 8ఏ, 9ఏలలో విద్యుత్ సరఫరా ఉండదని మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని నిజాంపేట్ సెక్షన్ ఏఈ కోరారు.

ప్రభుత్వ స్థలంలోని నిర్మాణాల కూల్చివేత

సుభాష్‌నగర్: ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపడితే ఊరుకునేది లేదని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. శని, ఆదివారాలు వరుస సెలవులు రావడంతో కబ్జారాయుళ్లు రెచ్చిపోయారు. గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్‌లోని సర్వేనం.329/1 ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపట్టారని విషయం తెలుసుకున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం రెవెన్యూ సిబ్బంది మూడు గదులను నాలుగు బేస్‌మెంట్లను నేలమట్టం చేశారు.

సంతాప సభ

కుత్బుల్లాపూర్: నందమూరి తారకరత్న మృతిని చింతిస్తూ సోమవారం కుత్బుల్లాపూర్ కమ్మ సేవాసమితి ఆధ్వర్యంలో సంతాప సభ ఏర్పాటు చేశారు. ఉదయం 9.30 గంటలకు జరిగిన ఈ కార్యక్రమానికి కమ్మసేవా సమితి సభ్యులు హాజరై తారకరత్న చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. తారకరత్న ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించామన్నారు.

నగల వ్యాపారిని ఏమార్చి

14 జతల వెండి పట్టీల తస్కరణ

దుండిగల్: నగల వ్యాపారిని ఏమార్చి 14 జతల వెండి పట్టీలను తస్కరించిన ఇద్దరు నిందితులను దుండిగల్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గండిమైసమ్మ చౌరస్తాలో ఉన్న శ్రీ ఓం జ్యూవెలర్స్‌లో వెండి పట్టీలు కొనుగోలు చేసేందుకు ఈనెల 18న రామాంతపూర్‌లోని కేసీఆర్‌నగర్‌కు చెందిన మునేపల్లి స్వాతి (31), ఆటో డ్రైవర్ మునేపల్లి కిరణ్(40), నాగోల్ ఆర్‌కే నగర్‌కు చెందిన రేణుక (40), శ్వేత (25)లు వచ్చారు. జ్యూవెలరీ యజమాని వెండి పట్టీలు చూపించే క్రమంలో అతడి దృష్టి మరల్చి 700 గ్రాముల విలువ చేసే 14 జతల వెండి పట్టీలతో నలుగురు నిందితులు ఉడాయించారు. కొద్ది సేపటికి మోసం జరిగిందని గ్రహించిన దుకాణ యజమాని దుండిగల్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి నుంచి 700 గ్రాముల వెండి పట్టీలను స్వాధీనం చేసుకుని వారిని సోమవారం రిమాండ్‌కు పంపారు. మిగతా ఇద్దరిని పట్టుకునేందుకు గాలింపు చేపట్టారు.

ఉద్యోగం రావడం లేదని యువకుడు ఆత్మహత్య


మృతుడు సాయి ప్రకాష్

జగద్గిరిగుట్ట: ఉద్యోగం రావడం లేదని మనస్తాపంతో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దీనబంధుకాలనీకి చెందిన సాయి ప్రకాష్(23) ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు. కాగా కొన్ని రోజులుగా జాబ్ వస్తుందని ఎదురు చూసిన అతను తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలో సోమవారం ఇంట్లో కుటుంబ సభ్యులు లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదమని తెలిసీ.. రోడ్లపై నిలిపి!


జీడిమెట్ల డిపో నుంచి ఎస్‌ఆర్ నాయక్‌నగర్ వెళ్లే రోడ్డుపై నిలిపిన వాహనాలు


ఐలా కార్యాలయం పక్కన ఉన్న పార్కింగ్ స్థలం

- రహదారులపైనే భారీ వాహనాల పార్కింగ్
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- రాత్రి వేళల్లో తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని ట్రాఫిక్ అధికారులు

జీడిమెట్ల: కాలనీ ప్రధాన రోడ్డుపై లారీలను పార్కింగ్ చేయడంతో ఇతర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. జీడిమెట్ల డిపో నుంచి ఎస్‌ఆర్ నాయక్‌నగర్, అపురూపాకాలనీ వెళ్లే రోడ్డులో నిత్యం కొంతమంది ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భారీ వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. రెండు కాలనీలలో కలిపి దాదాపు 30వేల వరకు జనాభా ఉంటుంది. దీంతో ప్రతినిత్యం రెండు కాలనీలకు ఆర్టీసీ బస్సులు, పారిశ్రామికవాడకు ఆనుకుని ఉండటంతో ఇతర వాహనాలు పెద్ద ఎత్తున రాకపోకలు సాగిస్తుంటాయి.

◆ జీడిమెట్ల ఫేజ్–3 ప్రధాన రోడ్డులో రోడ్డుకు సగాన్ని కంటైనర్లతో వచ్చిన వాహనాలు పార్కింగ్ చేయడంతో ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ విషయమై ఐలా అధికారులు గాని జీడిమెట్ల ట్రాఫిక్ అధికారులు గాని పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేయకుండా చూడాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

ఐలా పార్కింగ్ ఉన్నా అక్కడ నిలపరు..

పారిశ్రామిక ప్రాంతానికి వచ్చే వాహనాలు రోడ్లపై నిలుపుతుండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఐలా కార్యవర్గం, అధికారుల నిర్ణయంతో ఐలా కార్యాలయం పక్కనే ఉన్న స్థలాన్ని పార్కింగ్ కోసం కేటాయించారు. ఇక్కడ రోజుకు ఒక్కో వాహనానికి రూ.200 చార్జ్ చేస్తారు. కొంత మంది వాహనదారులు పార్కింగ్ ఫీజును తప్పించుకోవడానికి రోడ్లపై నిలుపుతున్నారు. కొందరు అవగాహన లేమితో రోడ్లపై పార్కింగ్ చేస్తున్నారని పేర్కొంటున్నారు.

రాత్రి వేళ ఇబ్బందులు, ప్రమాదాలు..

పగటిపూట వాహనాలు ఒకదానికి ఒకటి ఎదురుగా వచ్చినప్పుడు ఒక వాహనం ఆగి మరో వాహనం కదులుతోందని పేర్కొంటున్నారు. కొన్ని సందర్భాల్లో ఎదురుగా వేగంగా వచ్చే వాహనాలు ఒకదానికి ఒకటి ఢీకొట్టుకున్న సందర్భాలు చాలానే ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇక ద్విచక్రవాహనదారులు అయితే పెద్ద వాహనాలు వెళ్లే వరకు రోడ్డు పక్కనే ఆగి వెళ్లాల్సి వస్తోందని తెలుపుతున్నారు. సంవత్సరం కాలంగా రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేస్తున్నా వారికి చలానాలు విధించడం లేదని చెబుతున్నారు. రోడ్లపై వాహనాలు నిలపకుండా చూడాలని అధికారులను కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవాలి..



సంవత్సర కాలంగా రోడ్డుపై లారీలను విచ్చలవిడిగా పార్కిగ్ చేస్తూ మా వాహనాలు వెళ్లకుండా చేస్తున్నారు. దీంతో మా రెండు కాలనీల ప్రజలు డిపోవైపు వెళ్లాలంటే ఇబ్బందిగా మారింది. గురువారం కూరగాయల సంత ఉన్నప్పుడు డిపో వైపు వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేయకుండా చూడాలని కోరుతున్నాం.

– శ్రీనివాస్, ఎస్‌ఆర్‌నాయక్‌నగర్ వాసి

వైఎస్సార్‌టీపీ డివిజన్ అధ్యక్షుల నియామకం

కుత్బుల్లాపూర్: వైఎస్సార్–టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల యాత్రకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అడ్డుకునేందుకు యత్నిస్తోందని వైఎస్సార్‌టీపీ జీహెచ్‌ఎంసీ కోఆర్డినేటర్ వాడుక రాజగోపాల్, మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షుడు దేశిరెడ్డి సురేష్‌రెడ్డి అన్నారు. సోమవారం లోటస్‌పాండ్‌లో జరిగిన కార్యక్రమంలో వైఎస్ షర్మిల ఆదేశానుసారం గాజులరామారం, కుత్బుల్లాపూర్ సర్కిళ్ల పరిధిలోని డివిజన్లకు అధ్యక్షులను ప్రకటించారు. గాజులరామారం డివిజన్‌కు సి.నరసింహారెడ్డి, జగద్గిరిగుట్ట డివిజన్‌కు బి.శేఖర్, రంగారెడ్డినగర్ డివిజన్‌కు రఫీక్, చింతల్ డివిజన్‌కు వి.పుల్లారెడ్డి, సూరారం డివిజన్‌కు సంపంగి వెంకటేష్, సుభాష్‌నగర్ డివిజన్‌కు చంద్రశేఖర్, కుత్బుల్లాపూర్ డివిజన్‌కు ఒగ్గు రామిరెడ్డి, జీడిమెట్ల డివిజన్‌కు కిషోర్‌కుమార్‌రెడ్డిలను అధ్యక్షులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి, రాజగోపాల్ మాట్లాడుతూ... త్వరలో డివిజన్ల పూర్తి కార్యవర్గాన్ని ప్రకటిస్తామన్నారు. స్థానికంగా పార్టీని మరింత బలోపేతం చేసి అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటుతామని పేర్కొన్నారు.

కరోనా లక్షణాలు ఉంటే పరీక్షలు చేయించుకోండి

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో కోవిడ్–19 నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం సూరారంకాలనీ యూపీహెచ్‌సీలో 27 మందికి కోవిడ్ పరీక్షలు చేశారు. అందరికీ నెగిటివ్ రిపోర్టులు వచ్చినట్లు వైద్యాధికారులు తెలియజేశారు. దుండిగల్ పీహెచ్‌సీ, షాపూర్‌నగర్ యూపీహెచ్‌సీల్లో సైతం కోవిడ్ పరీక్షలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కరోనా లక్షణాలు ఉంటే పరీక్షలు చేయించుకోవాలని అధికారులు కోరారు.

కేంద్రం నిధులు రాష్ట్రానివంటూ తప్పుడు ప్రచారం


మధ్యప్రదేశ్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మురళీధర్ రావును సన్మానిస్తున్న కొంపల్లి నాయకులు

- బీజేపీ జాతీయ నాయకుడు మురళీధర్‌రావు
- కొంపల్లి మున్సిపాలిటీలో ప్రజాగోస – బీజేపీభరోసా

కుత్బుల్లాపూర్: కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులను బీఆర్‌ఎస్ ప్రభుత్వం తమవిగా పేర్కొంటూ రాష్ట్ర ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ జాతీయ నాయకుడు, మధ్యప్రదేశ్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మురళీధర్‌రావు అన్నారు. కొంపల్లి మున్సిపాలిటీ పరిధి ఎన్‌సీఎల్ నార్త్ కాలనీలో శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ శివాజీరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా గోస – బీజేపీ భరోసా కార్యక్రమానికి మురళీధర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కొంపల్లి మున్సిపాలిటీలో జాతీయ రహదారికి 500 మీటర్ల లోపు ఉన్న కాలనీల్లో డ్రైనేజీ, రోడ్లు ఏర్పాటు చేయకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. ఒక మున్సిపాలిటీలో సమస్యలు తీర్చలేని బీఆర్‌ఎస్ నాయకులు దేశంలోని సమస్యలు తీర్చడానికి బయలుదేరారని ఎద్దేవా చేశారు.

నిధులు కేటాయించినా తెచ్చుకోవడంలో విఫలం

◆ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ... బోయిన్‌పల్లి నుంచి కాలాకల్ వరకు ట్రాఫిక్ సమస్యలతో ఈ ప్రాంత ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి కేంద్ర ప్రభుత్వం రూ.1500 కోట్ల నిధులతో రోడ్ల విస్తరణ, ఫ్లైఓవర్లు చేపడుతుంటే రాష్ట్ర మంత్రులు ఇది తమ ఘనకార్యమని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. మున్సిపల్ పరిధిలో పన్నుల రూపేణా నిధులు వస్తున్నా స్థానికంగా అభివృద్ధి పనులు చేపట్టడం లేదన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ భాగంగా కేంద్ర ప్రభుత్వం మున్సిపాలిటీలకు నిధులు కేటాయించినా వాటిని తెచ్చుకోవడంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు.

◆ ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ నరేందర్, అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి, రూరల్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, కొంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సరిత, జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి సతీష్, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి జీవన్‌రెడ్డి, శక్తి కేంద్రం సహ ఇన్‌చార్జ్ మాధురి, ఎన్‌సీఎల్, నోబెల్ కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి


అభివృద్ధి పనుల సమీక్షలో అధికారులతో మాట్లాడుతున్న మేయర్

నిజాంపేట్: అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసేందుకు సమన్వయంతో పని చేయాలని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. సోమవారం నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ కమిషనర్ రామకృష్ణారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ డంపింగ్‌యార్డులో పరిశుభ్రత, ఎస్‌ఎన్‌డీపీ నాలా పనులు, శానిటేషన్, పార్కు అభివృద్ధి, ఓపెన్ జిమ్, క్రీడా ప్రాంగణాల అభివృద్ధి, వైకుంఠధామాల్లో మౌలిక సదుపాయాలపై ఆయా విభాగాల అధికారులతో చర్చించారు. అభివృద్ధి పనులకు సరిపడా నిధులు కేటాయించిన నేపథ్యంలో పనుల్లో వేగం పెంచి త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు విజయలక్ష్మి, చిట్ల దివాకర్, సురేష్‌రెడ్డి, సుధాకర్‌ముదిరాజ్, శ్రీరాములు, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, శానిటేషన్ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదు

టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి

కుత్బుల్లాపూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలు గుణపాఠం చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. సూరారం డివిజన్‌లోని రామకృష్ణనగర్ చౌరస్తా, వేమారెడ్డినగర్, సోనియాగాంధీనగర్, హమీద్ బస్తీ, లక్ష్మీనగర్, సూరారం గ్రామం, విశ్వకర్మ కాలనీల్లో సోమవారం హాత్ సే హాత్ జోడో యాత్ర చేపట్టిన హన్మంతరెడ్డి స్థానికంగా కాంగ్రెస్ పార్టీ జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ... తొమ్మిదేళ్ల పాలనలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలు పూర్తయితే పేద ప్రజలకు ఇవ్వకుండా జాప్యం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. బంగారు తెలంగాణ సాధనకు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, సంజీవరెడ్డి, పండరీరావు, మారి సంతోష్ ముదిరాజ్, శ్రీశైలంయాదవ్, సంపంగి వెంకటేష్, వెంకట్‌రెడ్డి, రాజిరెడ్డి, నవీన్, అబ్బాస్, రజాక్, సురేందర్‌రెడ్డి, సురేష్, మల్లేష్, యాదమ్మ, అన్నపూర్ణ, వారలక్ష్మి, మణెమ్మ, సువర్ణ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు నీటి సమస్యకు పరిష్కారం


సంపులోకి ట్యాంక్ నీటిని నింపుతున్న దృశ్యం

సుభాష్‌నగర్: కైసర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న నీటి సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. పాఠశాలలో నెలకొన్న నీటి సమస్యపై ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఇటీవల జలమండలి మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. స్పందించిన అధికారులు సోమవారం నీటి ట్యాంకర్‌ను పంపించి పాఠశాల ఆవరణలో ఉన్న సంపును నింపారు. నీటి సమస్యపై స్పందించిన జలమండలి అధికారులకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఏఐఎస్‌ఎఫ్ కార్యదర్శి శివ కృతజ్ఞతలు తెలియజేశారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


బాలు (ఫైల్)

కుత్బుల్లాపూర్: రాంగ్ రూట్‌లో వచ్చిన టాటా ఏస్ వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా ఉప్పుగూడ తాండకు చెందిన నెనవత్ బాలు ఆదివారం రాత్రి 12 గంటల సమయంలో ద్విచక్ర వాహనం (టీఎస్ 12 ఈక్యూ8841) పై వెళ్తుండగా గుండ్లపోచంపల్లి సమీపంలోని జీవీకే ఈఎంఆర్ఐ వద్ద రాంగ్ రూట్‌లో వచ్చిన టాటా ఏస్ (టీఎస్ 08 యుహెచ్ 2172) ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన బాలును పోలీసులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. సోమవారం ఉదయం 7.15 గంటలకు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దుండిగల్ పోలీస్ స్టేషన్‌కు అరుదైన గౌరవం


డీసీపీ సందీప్, సీఐ రమణారెడ్డికి ఎక్సలెన్సీ సర్టిఫికెట్ అందజేస్తున్న డీజీపీ అంజనీకుమార్

దుండిగల్: దుండిగల్ పోలీస్‌స్టేషన్ అరుదైన గౌరవం లభించింది. తెలంగాణ వ్యాప్తంగా మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ (ఎంహెచ్‌ఏ) నిర్వహించిన సర్వేలో దుండిగల్ పోలీస్‌స్టేషన్‌కు 2022 సంవత్సరానికి గాను ఉత్తమ పోలీస్‌స్టేషన్‌గా ఎంపికయ్యింది. పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదులు చేసేందుకు వచ్చే వారిని రిసీవ్ చేసుకోవడం... కేసుల నమోదు, దర్యాప్తు తదితర విషయాలను పరిగణనలోకి తీసుకుని ఎంహెచ్‌ఏ దేశ వ్యాప్తంగా ఉన్న పోలీస్‌స్టేషన్లకు ర్యాకింగ్ జారీ చేస్తూ వస్తోంది. సోమవారం డీజీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డీజీపీ అంజనీకుమార్ చేతుల మీదుగా ఎక్సలెన్సీ సర్టిఫికెట్‌ను మేడ్చల్ డీసీపీ సందీప్, దుండిగల్ సీఐ రమణారెడ్డి అందుకున్నారు.

◆ ఈ సందర్భంగా అంజనికుమార్ మాట్లాడుతూ... ఎంహెచ్‌ఏ సర్టిఫికేట్ పొందడం అసాధారణమైన విషయమన్నారు. దుండిగల్ పోలీస్‌స్టేషన్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మిగతా పోలీస్‌స్టేషన్లకు ఆదర్శప్రాయంగా నిలిచిందన్నారు. దుండిగల్ పోలీస్‌స్టేషన్‌కు ఎక్సలెన్సీ సర్టిఫికెట్ రావడం పట్ల సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మేడ్చల్ డీసీపీ, ఏసీపీ, దుండిగల్ సీఐ, పోలీస్ సిబ్బందిని అభినందించారు. ఈ అవార్డు మొత్తం పోలీస్ సిబ్బంది సేవల కాంట్రిబ్యూషన్‌తోనే సాధ్యపడిందని సీపీ పేర్కొన్నారు.

చోరీకి యత్నించిన వ్యక్తి అరెస్టు

దుండిగల్: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీకి యత్నించిన వ్యక్తిని పోలీసులకు అప్పగించిన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం కాలనీ రెండో ఓం జెండా సమీపంలో ఉండే గోపాల్‌రెడ్డి దంపతులు సోమవారం డ్యూటీల నిమిత్తం బయటకు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన ఓ వ్యక్తి ఇంటి తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించాడు. ఈ క్రమంలో ఇంటికి వచ్చిన గోపాల్‌రెడ్డి లోపల గడియ పెట్టి ఉండటంతో భార్యకు ఫోన్ చేయగా తాను కార్యాలయంలో ఉన్నట్లు చెప్పింది. దీంతో తలుపులు బద్దలకొట్టి లోనికి వెళ్లి చూడగా ఓ వ్యక్తి ఆల్మారా తెరిచి చోరీకి యత్నిస్తున్నాడు. దీంతో గోపాల్‌రెడ్డి సదరు వ్యక్తికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించాడు. విచారణలో గుండ్లపోచంపల్లికి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డిగా గుర్తించారు. అతను కండ్లకోయలోని ఓ చాక్లెట్ కంపెనీలో ప్యాకింగ్ బాయ్‌గా పని చేస్తున్నాడని పోలీసులు తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ నిర్మాణాలు, కబ్జాలపై ప్రజావాణిలో ఫిర్యాదు


మేడ్చల్ కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేస్తున్న సీపీఐ నాయకులు

నిజాంపేట్: బాచుపల్లి మండలంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలు, కబ్జాలపై సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో సీపీఐ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ... బాచుపల్లి మండల పరిధిలోని ప్రభుత్వ సర్వే నం.86, 87, 90, 94, 95, 191, 233, 332, 364లలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలు, కబ్జాలపై మున్సిపల్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. దీంతో కోట్లాది రూపాయల ప్రభుత్వ భూములు కరుమరుగవుతున్నాయని ఆరోపించారు. బాచుపల్లి మండల ఇన్‌చార్జ్ సర్వేయర్ శ్రీనాథ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవిల వైఖరి కబ్జాదారులకు వత్తాసు పలికే విధంగా ఉందన్నారు. వెంటనే ప్రభుత్వ భూములను సర్వే చేసి వాటిని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. నిజాంపేట్ కార్పొరేషన్‌కు శాశ్వత ప్రాతిపదికన కమిషనర్‌ను నియమించాలని వినతిలో కోరారు. సీపీఐ నాయకులు యాదయ్య, శివ, హరినాథ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు క్రీడలు, సేవా కార్యక్రమాల్లో ముందుండాలి


విద్యార్థులకు మెమెంటోలు అందజేస్తున్న ఎంఈఓ ఆంజనేయులు, పంచశీల ఫౌండేషన్, సాయి గణేష్ ఉత్సవ కమిటీల సభ్యులు

రంగారెడ్డినగర్: నేటి బాలలు రేపటి తరానికి దిక్సూచిగా నిలవాలని కుత్బుల్లాపూర్ మండల విద్యాధికారి ఆంజనేయులు అన్నారు. సోమవారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి చెన్నారెడ్డినగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పంచశీల ఫౌండేషన్, సాయి గణేష్ ఉత్సవ కమిటీల సభ్యులు జింకల వెంకటేష్ ముదిరాజ్, రాజేశ్వర్‌ల ఆధ్వర్యంలో విద్యాశాఖ ప్రవేశపెట్టిన ఎఫ్‌టీఎల్‌టీఎంఎల్ మేళా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంజనేయులుతో పాటు గాంధీనగర్ జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు వెంకటరాములు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

◆ చిన్నతనం నుంచే చదువుతో పాటు క్రీడలు, సామాజిక సేవ కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలన్నారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసే సత్తా నేటి విద్యార్థుల్లో ఉందన్నారు. తల్లిదండ్రుల కలలను సాకారం చేసేందుకు విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. విద్యతో పాటు పలు సంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమొంటోలు, సర్టిఫికెట్లను అందజేశారు.

◆ ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పార్వతి, మధు, విద్యావలంటీర్ శాంతి, సామాజికవేత్త కెపెన్ భీమయ్య, సంఘ సేవకులు, ప్రముఖ కవి వాకిటి రామిరెడ్డి, పారిశ్రామికవేత్త ఆంజనేయులు, కమిటీ సభ్యులు భాషయ్య, సూర్యనారాయణ, దేశ్‌ముఖ్, రాములు, మాజీ వార్డు సభ్యులు రహీం తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లు పాదచారులకే.. వ్యాపారాలకు కాదు.!


ఐడీపీఎల్- జగద్గిరిగుట్ట రోడ్డులో ఫుట్‌పాత్‌ను అక్రమించి వ్యాపారం


చింతల్ రోడ్డులోని హ్యాపీ చిల్డ్రన్స్ ఆస్పత్రి సమీపంలో ఫుట్‌పాత్‌పై వస్తు సామగ్రి

రంగారెడ్డినగర్: పాదచారుల రాకపోకల కోసం జీహెచ్‌ఎంసీ పరిధిలో ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లు అక్రమణలకు గురవుతున్నాయి. ఫుట్‌పాత్‌లు పాదచారులకే అన్న హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయడంతో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో ఫుట్‌పాత్‌లు తమ కోసమే నిర్మించారన్నట్లుగా కబ్జాదారులు వ్యవహరిస్తున్నారు. స్థానికంగా ఉన్న నాయకుల అండతో.. జీహెచ్‌ఎంసీ కిందిస్థాయి సిబ్బందికి నెలవారీ మామూళ్లు ఇస్తూ.. ఫుట్‌పాత్‌లతో పాటు రోడ్లను సైతం అక్రమిస్తూ కొందరు వ్యాపారాలు కొనసాగిస్తున్నారు.

ఫుట్‌పాత్‌లపైనే విక్రయాలు

కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలోని ఐడీపీఎల్ – జగద్గిరిగుట్ట రోడ్డు, చింతల్ ప్రధాన రోడ్డు, హెచ్‌ఎంటీ ప్రధాన రోడ్డు, షాపూర్‌నగర్, సుచిత్ర, సూరారం, జగద్గిరిగుట్ట తదితర ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపైనే టీస్టాళ్లు, మాంసం, చేపల విక్రయ దుకాణాలు, రెడీమేడ్ గార్మెంట్స్, పండ్లు, కూరగాయల దుకాణాలను నిర్వహిస్తున్నారు. చింతల్ ప్రధాన రోడ్డులోని పలువురు సెకండ్ హ్యాండ్ ద్విచక్ర వాహనాల విక్రయదారులు ఫుట్‌పాత్‌లపైనే నిలుపుతున్నారు. ఐడీపీఎల్ – జగద్గిరిగుట్ట రోడ్డులో దాదాపు ఫుత్‌పాత్ మొత్తం కబ్జాకు గురైంది.

రోడ్లపైనే నడుస్తున్న పాదచారులు

షాపూర్‌నగర్ ప్రధాన రోడ్డులో ఫుత్‌పాత్‌లను పలువురు సామగ్రిని డంప్ చేస్తున్నారు. ఇక సుచిత్ర సర్కిల్‌లో పండ్లు, కూరగాయల దుకాణదారులు, టిఫిన్ సెంటర్ల నిర్వాహకులు వ్యాపారాలు నిర్వహిస్తూ పాదచారులకు అడ్డంకులు సృష్టిస్తున్నారు. ఇలా జంట సర్కిళ్ల పరిధిలో ఫుట్‌పాత్‌లు అక్రమణలకు గురి కావడంతో పాదచారులు రోడ్లపైనే నడవాల్సిన పరిస్థితి నెలకొంటోంది.

పత్రికల్లో కథనాలు వచ్చినప్పుడే స్పందన...

వార్తా పత్రికల్లో ఫుట్‌పాత్‌ల అక్రమణలపై కథనాలు ప్రచురితమైనపుడే సర్కిల్ అధికారులు హడావుడి చేస్తున్నారే తప్ప శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. దీంతో ఫుట్‌పాత్‌ల అక్రమణలకు అడ్డూ అదుపు లేకుండా పోతోందని పాదచారులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఫుట్‌పాట్ అక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పాదచారులు, మార్నింగ్ వాకర్లు కోరుతున్నారు.